
సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 5 । మే । 2024



జగన్‌తో బడుగులకు మేలు

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి సీఎం జగన్ ప్రభుత్వం పని చేస్తోందని బామ్‌సెఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు అన్నారు. - 8లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 100, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 3350 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
41.0° / 28.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	41.0	28.0
కాకినాడ	39.4	29.0
అమలాపురం	40.0	28.0

న్యూస్‌రీల్

ముస్లింలు.. కూటమి మాయలో పడొద్దు



మహ్మద్ ఆరిఫ్

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి మాయలో పడవద్దని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహ్మద్ ఆరిఫ్ ముస్లింలకు పిలుపునిచ్చారు. తన కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ నాయకులు ప్రకటించడం, వారితో పొత్తులో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు ఆ వ్యాఖ్యల్ని ఖండించకపోవడాన్ని గమనించాలని కోరారు. కూటమికి ఓటు వేసినా, కాంగ్రెస్‌కు వేసినా నష్టపోవడం తప్పదన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ముస్లింలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఈ విషయం గ్రహించిన ముస్లింలు నూరు శాతం.. వైఎస్సార్ సీపీకి పట్టంకట్టి, మరోసారి అధికారాన్ని అందించడానికి సిద్ధమయ్యారని తెలిపారు. కూటమి అధికారంలోకి వస్తే మొదట ముస్లింల రిజర్వేషన్లు తొలగించడంతో ప్రారంభించి, పౌరసత్వ చట్టాన్ని రద్దు చేసి, మతపరమైన అస్థిరత్వాన్ని ప్రేరేపిస్తారని హెచ్చరించారు. తద్వారా తదుపరి ఎన్నికల సమయానికి ముస్లిం సమాజంలోని శక్తిసామర్థ్యాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తారని హెచ్చరించారు. సీఎం జగన్ ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇచ్చి, తమ అభివృద్ధికి తామే బాటలు వేసుకోవాలని ముస్లింలకు మహ్మద్ ఆరిఫ్ పిలుపునిచ్చారు.

శృంగార వల్లభునికి రూ.3.28 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో వేంచేసిన శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని, ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. దర్శనం టికెట్లు, అన్నదాన విరాళాలు, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.3,28,855 ఆదాయం సమకూరిందని ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానంతో పాటు మజ్జిగ కూడా అందించామని చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు.

ప్రగతికి జైకొడతారా!

- మారుతున్న సిటీ ఓటర్ల మనోగతం
- రెండేళ్లలో మారిన రాజమహేంద్రవరం రూపురేఖలు
- సుందర నగరం దిశగా అడుగులు
- రూ.558 కోట్లతో అభివృద్ధి పనులు

సాక్షి, రాజమహేంద్రవరం: పావన గోదావరి తీరాన ఉన్న అతి పెద్ద నగరం రాజమహేంద్రవరం. ఇక్కడ పన్నెండేళ్లకోసారి జరిగే గోదావరి పుష్కరాలకు దేశ వ్యాప్తంగానే ప్రజలు కోట్లాదిగా తరలివస్తుంటారు. ఆ సమయంలో మాత్రమే ఈ నగర అభివృద్ధి గురించి గత పాలకులు పట్టించుకునేవారు. మిగిలిన సమయంలో ఈ చారిత్రక, సాంస్కృతిక నగరంపై కొన్ని దశాబ్దాలుగా నిర్లక్ష్యం చూపేవారు. ఫలితంగా పుష్కరానికోసారి మాత్రమే రాజమహేంద్రవరం అభివృద్ధి అనే నానుడి నగర ప్రజల హృదయాల్లో బలంగా స్థిరపడిపోయింది. అయితే.. ప్రస్తుతం రాజమండ్రి సిటీ ఓటర్ల అభిప్రాయం ప్రగతికి జై కొట్టేలా మారుతోందా.. గడచిన రెండేళ్లలో నగరంలో జరిగిన అభివృద్ధి, సుందర నగరంగా రూపుదిద్దే దిశగా పడుతున్న అడుగులే ఇందుకు కారణమవుతున్నాయా అంటే ఇక్కడి ప్రజలు, రాజకీయ విశ్లేషకుల నుంచి అవుననే సమాధానం వస్తోంది.

ప్రజల మనసు గెలిచిన అభివృద్ధి

ఐదు లక్షలకు పైగా జనాభా ఉన్న రాజమహేంద్రవరం కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోని నగరంగా మిగిలిపోయింది. తీరని నిరాదరణకు గురైన ఈ నగరంలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల వసతులూ కల్పించే దిశగా ప్రస్తుత ప్రభుత్వం అడుగులు వేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గడచిన ఐదేళ్లలో ఈ నగర అభివృద్ధికి సాధారణ, ప్రత్యేక, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) నిధులు రూ.558 కోట్లు వెచ్చించింది. కరోనా మహమ్మారి విజృంభించడంతో రెండేళ్ల పాటు అన్ని వ్యవస్థలూ స్తంభించిపోయిన విషయం తెలిసిందే. ఆ తరువాత కేవలం రెండేళ్లలోనే ఎవ్వరూ, ఎన్నడూ ఊహించని రీతిలో నగరాభివృద్ధి జరిగింది. ఫలితంగా రోడ్లు, మురుగునీటి కాలువలు, తాగునీటి పథకాల నిర్వహణ పనులు పట్టాలెక్కాయి. ప్రజలు వారాంతంలో ఆహ్లాదంగా గడిపేందుకు అనువైన స్థలాలు అందుబాటులోకి వచ్చాయి. పచ్చదనం పెంపొందించడంతో పాటు పార్కులను ఆకర్షణీయంగా అభివృద్ధి చేశారు. ఆర్ట్స్ కళాశాల సమీపాన అర్బన్ ఫుడ్ ప్లాజా, రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా కంబాల చెరువు పార్కు, పుష్కర ఘాట్ వద్ద పుష్కర ప్లాజా,



నగరంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్

హ్యాపీ స్ట్రీట్, ఫుడ్ స్ట్రీట్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఆరోగ్య ఉప కేంద్రాలు, మున్సిపల్ పాఠశాలలను ఆధునీకరించారు. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మించడంతో పాటు గత ఏడాది తరగతులు ప్రారంభించారు. ఊహించని స్థాయిలో జరిగిన ఈ అభివృద్ధి ప్రజల మనసుల్ని గెలిచింది.

అభివృద్ధి అజెండాగా..

వైఎస్సార్ సీపీ రాజమండ్రి సిటీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మార్గాని భరత్‌రామ్ బరిలో ఉన్నారు. అభివృద్ధి, సంక్షేమం, నగర సుందరీకరణే ప్రధాన అస్త్రాలుగా ఆయన విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో రెండేళ్లలో తాను చేసిన అభివృద్ధిని వివరిస్తూ ముందుకెళుతున్నారు. 'ఇదీ నా ప్రోగ్రెస్ కార్డ్' అంటూ ప్రజల్లోకి వెళుతున్నారు. అభివృద్ధి చేశానని భావిస్తేనే ఓటెయ్యండని ధైర్యంగా అభ్యర్థిస్తున్నారు. చేసిన పనులను ఆధారాలతో సహా చూపిస్తూండటంతో ప్రజల్లో ఆయనకు ఆదరణ లభిస్తోందని టీడీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు.

కంచుకోటకు బీటలు తప్పవా!



ఆదిరెడ్డి వాసు
టీడీపీ అభ్యర్థి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల్లో టీడీపీ వరుసగా మూడుసార్లు మేయర్ పీఠం అధిరోహించింది. ఆ పార్టీ నుంచి ఆదిరెడ్డి భవాని 2019 సార్వత్రిక ఎన్నికల్లో 32 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. అంత మెజార్టీ ఇచ్చి గెలిపించినప్పటికీ నగర వాసులకు ఎమ్మెల్యే దర్శనమే కరువైందన్న విమర్శలున్నాయి. ఏదైనా సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. కోవిడ్ సమయంలో ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రజాప్రతినిధులందరూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తే.. ఎమ్మెల్యే భవానీ మాత్రం కనిపించేవారు కారన్న విమర్శలు వచ్చాయి. చివరకు టీడీపీ అధికారిక కార్యక్రమాలు, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలకు సైతం ఆమె హాజరైన దాఖలాలు లేవు. ఈ పరిణామాలు టీడీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను పెంచాయి. మూడుసార్లు మేయర్ పీఠంపై కూర్చున్న టీడీపీ.. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు సైతం చెప్పుకోదగినవి లేవనే విమర్శ నగర వాసుల్లో వినిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే భవానీ భర్త ఆదిరెడ్డి వాసు టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. ఆయన వ్యవహార శైలితో ఆ పార్టీలో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. పార్టీకి విధేయులుగా పని చేసిన నేతలను, సీనియర్లను పక్కన పెట్టేశారన్న అపవాదును ఆయన మూటగట్టుకున్నారు. దీంతో టీడీపీ సీనియర్లు ప్రచారంలో అంటీముట్టనట్లు ఉంటున్నారు.

దీంతో వాసు ఎన్నికల ప్రచారం చప్పగా సాగుతోంది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన వాసు తండ్రి ఆదిరెడ్డి అప్పారావు అంతా తానై వ్యవహరిస్తూ, నగరంలో అర్ధరాత్రి ప్రచారాలు చేపడుతున్నట్లు చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ నేతలు, వార్డు ఇన్‌చార్జుల ఇళ్లకు వెళ్లి, ఎన్నికల్లో తమకు మద్దతు తెలపాలని ప్రలోభాలకు గురి చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వైఎస్సార్ సీపీకి ప్రజల్లో ఆదరణ వస్తుండటం.. టీడీపీ గ్రాఫ్ రోజు రోజుకూ దిగజారుతుండటంతో ఆదిరెడ్డి వర్గంలో గెలుపుపై ధీమా సన్నగిల్లుతోందని అంటున్నారు.

తమ హయాంలో ఏం అభివృద్ధి జరిగిందో కూడా ఎన్నికల ప్రచారంలో చెప్పుకోలేని పరిస్థితి తలెత్తింది. వీటన్నింటి నేపథ్యంలో ఈ టీడీపీ కంచుకోట బద్దలవక తప్పదని విశ్లేషకులు చెబుతున్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై చంద్రబాబు విష ప్రచారం



మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు విష ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు అబద్ధం తప్ప నిజం మాట్లాడరనడానికి ఇదే ఉదాహరణని మండిపడ్డారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేయాలని నీతి ఆయోగ్ 2019లో ప్రతిపాదించిందన్నారు. ఆ అంశాలపై రాష్ట్రంలో ల్యాండ్ రీ సర్వే జరగాలని, వంద సంవత్సరాలుగా భూములకు సంబంధించిన వివాదాలు అలాగే ఉండిపోతున్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపారన్నారు. అయితే, ప్రజలను తప్పుదారి పట్టిస్తూ, భయాందోళనలకు గురి చేసేలా.. భూములన్నీ సీఎం జగన్ లాగేసుకుంటున్నారంటూ చంద్రబాబు పరమ దుర్మార్గంగా అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు పొత్తు పెట్టుకున్న బీజేపీ ప్రభుత్వమే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతిపాదించిందన్నారు. తాను అధికారంలోకి వస్తే ఆ యాక్ట్‌ను రద్దు చేయడానికి సంతకం చేస్తానని చంద్రబాబు చెబుతున్నారని, అది సాధ్యమేనా అని ప్రశ్నించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై టీడీపీ, జనసేన చేస్తున్న విష ప్రచారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వివరణ ఇవ్వాలని మంత్రి వేణు డిమాండ్ చేశారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయం, ఆన్‌లైన్ ద్వారా రూ.37,04,739 ఆదాయం సమకూరింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా పందిళ్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పోస్టల్ బ్యాలెట్‌కు సర్వం సిద్ధం

- 7న ఓటింగ్
- ఆ రోజు వేయని వారికి 8, 9 తేదీల్లో మరో చాన్స్
- జిల్లాలో 339 మందికి అవకాశం

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైంది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్ రోజున ఓటు వేసేలా అన్ని చర్యలూ తీసుకుంటారు. సాధారణంగా ఓటర్లందరూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేస్తారు. అయితే ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు, ఈ ప్రక్రియలో అత్యవసర విధుల్లో ఉండే సిబ్బందికి పోలింగ్ రోజున తమ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే అవకాశం ఉండదు. వారు కూడా ఓటు హక్కు వినియోగించుకునే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించింది. జిల్లాలో పది అత్యవసర సేవా విభాగాల్లో పని చేస్తున్న సుమారు 339 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుంటున్నారు. వీరిలో జిల్లాలోని 7 నియోజకవర్గాలకు చెందిన 217 మంది, ఇతర జిల్లాలకు చెందిన వారు 122 మంది ఉన్నారు. వీరికి రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యిలోని ఫ్యూచర్ కిడ్స్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించారు. ఆ రోజు అక్కడ పోస్టల్ బ్యాలెట్ వేయని వారు, తమ సొంత నియోజకవర్గంలో సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఈ నెల 8, 9 తేదీల్లో ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. అదే వారికి చివరి అవకాశం. ఆ తేదీల్లో పోస్టల్ బ్యాలెట్‌ను వారు వినియోగించుకోకపోతే ఈ నెల 13న జరిగే పోలింగ్ రోజున వారికి ఓటు వేసే అవకాశం ఉండదు.

చురుకుగా ఓటర్ స్లిప్పుల పంపిణీ

జిల్లాలోని 1,577 మంది బూత్ లెవెల్ అధికారుల (బీఎల్‌ఓ) ద్వారా ఓటర్ స్లిప్పుల పంపిణీ చురుకుగా జరుగుతోందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్లిప్పుల ద్వారా ప్రతి ఓటర్‌కూ వారి పోలింగ్ కేంద్రం, ఓటర్ సమగ్ర సమాచారం, ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 16,23,149 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకూ 15,96,946 ఓటర్ స్లిప్పులు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి జిల్లాకు వచ్చాయని తెలిపారు. ఇప్పటి వరకూ 6,20,694 మందికి ఇంటింటికీ తిరిగి ఈ స్లిప్పులు పంపిణీ చేశారన్నారు.



పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, అధికారులు

నియోజవర్గాల వారీ ఓటర్ స్లిప్పుల పంపిణీ వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పంపిణీ చేసిన స్లిప్పులు
అనపర్తి	2,26,053	65,155
రాజానగరం	2,16,491	1,07,731
రాజమండ్రి సిటీ	2,67,484	1,00,992
రాజమండ్రి రూరల్	2,72,826	1,03,396
కొవ్వూరు	1,84,136	74,800
నిడదవోలు	2,13,396	1,05,724
గోపాలపురం	2,42,763	62,836

కొవ్వూరు.. విలక్షణం



- తొలి ద్విసభ్య నియోజకవర్గాల్లో ఒకటి
- అప్పట్లో నేటి గోపాలపురం, కొవ్వూరు సెగ్మెంట్ల గ్రామాలతో కలగలసి..
- మొదట్లో జనరల్ స్థానం, 2009 నుంచి ఎస్సీ రిజర్వుడు
- ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.1,298 కోట్ల లబ్ధి
- జిల్లాలోనే తక్కువ ఓటర్లు కలిగిన నియోజకవర్గం

కొవ్వూరు: ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంగా ఉన్నప్పుడు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొవ్వూరు ఒకటి. ఇక్కడి ప్రజల్లో రాజకీయ చైతన్యం ఎక్కువ. జిల్లా రాజకీయాలను చక్రం తిప్పిన అల్లూరి బాపినీడు, పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు), పీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన జీఎస్ రావు వంటి ఉద్దండులు ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారే. గోదావరి నది తీరం వెంబడి విస్తరించి ఉన్న నియోజకవర్గం కొవ్వూరు.

ఇదీ చరిత్ర

1952లో ఏర్పడిన కొవ్వూరు నియోజకవర్గం పదేళ్ల పాటు ద్విసభ్య శాసన సభా స్థానంగా కొనసాగింది. అప్పట్లో జనరల్ నుంచి ఒకరిని, మరొకరిని ఎస్సీల నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నుకునేవారు. ఇప్పటి కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలతో కూడి అప్పట్లో కొవ్వూరు నియోజకవర్గం ఉండేది. 1962లో కొవ్వూరు సెగ్మెంట్‌లోని కొంత భాగాన్ని విడదీసి గోపాలపురం నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. 1962 నుంచి 2009 వరకూ కొవ్వూరు సెగ్మెంట్ జనరల్ స్థానంగా ఉంది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ఎస్సీ రిజర్వుడు స్థానంగా మారింది.

సహజవనరుల ఖిల్లా

కొవ్వూరు నియోజకవర్గం అనేక సహజ వనరులకు ఖిల్లాగా ఉంది. గోదావరి నదిలో సహజ సిద్ధంగా లభించే ఇసుక, కొవ్వూరు మండలం ఐ.పంగిడి, ఆ పరిసర ప్రాంతంలో విస్తరించిన నల్లరాతి క్వారీలు ప్రధాన ఆదాయ వనరులు. గోదావరి నదిపై ఉన్న పలు ఎత్తిపోతల పథకాలు, బోర్లు ప్రధాన సాగునీటి వనరులు. గోదావరి నది నుంచి పశ్చిమ డెల్టా ఆయకట్టుకు నీటిని అందిస్తున్న ముఖద్వారం కొవ్వూరు మండలం సీతంపేట గ్రామం. ఇక్కడి నుంచే పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలతో పాటు తూర్పు గోదావరి జిల్లాలోని కొంత ఆయకట్టుకు నీరు సరఫరా అవుతుంది. పురాణ ప్రాశస్త్యం గల పవిత్ర గోష్పాద క్షేత్రం కూడా కొవ్వూరులోనే ఉంది. ఐ.పంగిడిలో ప్రసిద్ధ త్రివేణి గ్లాస్ పరిశ్రమ ఉంది. జిల్లాల పునర్విభజన తర్వాత తూర్పు గోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఆరు చోట్ల రెండు లక్షలకు పైగా ఓటర్లు ఉంటే, ఒక్క కొవ్వూరు సెగ్మెంట్ లోనే అత్యల్పంగా 1,84,136 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లు, జనాభా, విస్తీర్ణం పరంగా జిల్లాలోని చిన్న నియోజకవర్గంగా కొవ్వూరును పేర్కొనవచ్చు.



మంత్రులుగా నలుగురికి అవకాశం

ఇక్కడి నుంచి ఎన్నికైన అనేక మందికి రాష్ట్ర మంత్రివర్గంలో అవకాశం లభించింది. 1955–62 మధ్య ద్విసభ్య స్థానంలో ఎస్సీ రిజర్వుడు నుంచి ఎన్నికైన తానేటి వీరరాఘవులు మంత్రిగా పని చేశారు. అనంతరం 1962లో ఈ సెగ్మెంట్‌ను జనరల్‌గా మార్చారు. 1979లో ఇందిరా కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎంఏ అజీజ్ మంత్రిగా పని చేశారు. 2009 నుంచి ఎస్సీ రిజర్వుడు స్థానంగా కొనసాగుతోంది. 2014లో గెలిచిన కేఎస్ జవహర్ టీడీపీ హయాంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ మంత్రిగాను, 2019లో వైఎస్సార్ సీపీ నుంచి గెలిచిన తానేటి వనిత హోం, విపత్తుల నివారణ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు.

విలక్షణ తీర్పు ఓటర్ల సొంతం

రాజకీయ చైతన్యం కలిగిన ఈ నియోజకవర్గ ఓటర్లు విలక్షణమైన తీర్పు ఇస్తున్నారు. 1999లో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తే ఇక్కడి ప్రజలు మాత్రం కాంగ్రెస్ పార్టీకి చెందిన జీఎస్ రావుకు ఎమ్మెల్యేగా పట్టం కట్టారు. అప్పట్లో పశ్చిమ గోదావరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తుడిచి పెట్టుకు పోయింది. కొవ్వూరు స్థానం మాత్రం కాంగ్రెస్ ఖాతాలో చేరింది. 2004లో మహానేత వైఎస్సార్ ప్రభంజనంతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇక్కడ మాత్రం టీడీపీ అభ్యర్థిగా పెండ్యాల కృష్ణబాబు గెలిచారు. 2009లో రాష్ట్రంలో రెండోసారి వైఎస్ అధికారంలోకి వచ్చినపుడు ఇక్కడ టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు. వరుసగా మూడు విడతల నుంచి ఇక్కడ ఓటర్లు విలక్షణ తీర్పు ఇస్తుండడంతో రాజకీయ విశ్లేషకులు సైతం ఇక్కడి ఫలితాలపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 1952లో అప్పటి పశ్చిమ గోదావరి జిల్లాలోని మిగతా 11 స్థానాలూ కాంగ్రెస్‌కు దక్కినప్పటికీ ఇక్కడి ఓటర్లు మాత్రం పిన్నమనేని రామచంద్రరావు (సీపీఐ)ను, మల్లిపూడి రాజేశ్వరరావు (ఇండిపెండెంట్)ను గెలిపించారు. 1968లో కుంటముక్కల బుచ్చిరాయుడు, 1973లో ఆళ్ల హనుమంతరావు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలిచారు.

2019 జూన్ - 2024 జనవరి మధ్య వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందిన లబ్ధి

నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యే పథకాలు (డీబీటీ విధానం)

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ పింఛను కానుక	34,838	361.02
జగనన్న అమ్మ ఒడి	34,222	102.78
వైఎస్సార్ చేయూత	18,371	56.86
వైఎస్సార్ ఆసరా	39,290	152.89
వైఎస్సార్ రైతు భరోసా	32,293	76.51
ఇంటి నిర్మాణానికి నేరుగా చెల్లింపు	8,447	76.35
వైఎస్సార్ సున్నా వడ్డీ	48,782	21.50
వైఎస్సార్ కాపునేస్తం	6,174	19.36
ఉచిత పంటల బీమా	8,656	12.40
జగనన్న విద్యా దీవెన	15,539	48.01
జగనన్న వసతి దీవెన	11,451	17.26
వైఎస్సార్ నేతన్న నేస్తం	1,065	4.43
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	4,466	7.17
వైఎస్సార్ బీమా పథకం	695	18.47
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	3,897	3.51
వైఎస్సార్ వాహన మిత్ర	2,308	4.46
సున్నా వడ్డీకే పంట రుణాలు	7,500	3.97
జగనన్న చేదోడు	2,916	4.56
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	7,440	27.40
తెలుపు కార్డుదారులకు కోవిడ్ సాయం	47,417	4.69
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	4,783	5.53
వైఎస్సార్ మత్స్యకార భరోసా	350	1.19
అగ్రిగోల్డ్ బాధితులకు సాయం	1,055	1.12
వైఎస్సార్ లా నేస్తం	1,234	0.23
వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీతోఫా	317	1.39
అర్చకులు, ఇమామ్‌లు, పాస్టర్లకు సాయం	245	0.31
జగనన్న విదేశీ విద్య	691	14.54
మొత్తం	3,44,442	1047.94

నాన్ డీబీటీ పద్ధతి

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
జగనన్న తోడు	6,581	9.36
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	26,398	24.41
జగనన్న గోరుముద్ద	26,998	11.99
జగనన్న విద్యా కానుక	20,369	24.28
ఇళ్ల స్థలాలు (భూసేకరణ, పరిహారం, చెల్లింపులు)	9,860	180.32
మొత్తం	90,206	250.36

జగన్‌తో బడుగులకు మేలు

- ఫూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారావు
- వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నయనాల కృష్ణారావు

రాజమహేంద్రవరం సిటీ: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని ఫూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, బామ్‌సెఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు తెలిపారు. శనివారం రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల పాటు సామాజిక ఉద్యమంలో పనిచేసి ఫూలే, అంబేద్కర్ సిద్ధాంతాలను దేశ వ్యాప్తంగా ప్రచారం చేశానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలహీన వర్గాల సంక్షేమానికి చేస్తున్న కృషి అద్భుతమన్నారు. జగన్ ఆలోచనలు, ఆశయాలకు ఆకర్షితుడనై బామ్‌సెఫ్, మూల్ నివాసీ జాతీయ అధ్యక్ష పదవికి కూడా రాజీనామా చేసి, వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2.70 లక్షల కోట్లు ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. పంపిణీ చేసిన 30 లక్షల ఇళ్ల స్థలాల్లో 80 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసి బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకునేలా ప్రోత్సహిస్తుందన్నారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్, పార్లమెంట్ అభ్యర్థులు మార్గాని భరత్‌రామ్, చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజా విజయానికి కృషి చేస్తానన్నారు. అలాగే రాజోలు, పిఠాపురం పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం చేస్తానని కృష్ణారావు తెలిపా రు. నాయకులు రేలంగి శేఖర్, జామి రాజ్‌కుమార్, రహీమ్, అలీషా, దంగేటి శివాజీ, మేఘేంద్ర, డి.కొండలరావు పాల్గొన్నారు.

బంగారం, నగదు చోరీ

ఐ.పోలవరం: మండలంలోని టి.కొత్తపల్లిలో ఓ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉద్దీశ వెంకటేశ్వరరావు గృహంలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించారు. బీరువాలోని 97 గ్రాముల బంగారం, 5 తులాల వెండితో పాటు రూ.19,800 నగదు తస్కరించారు. ఇంట్లో అందరూ నిద్రలో ఉండగా ఈ చోరీ జరిగింది. శనివారం బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం సీఐ కొండయ్య, ఎస్సై భానుప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ కొండయ్య, ఎస్సై భానుప్రసాద్

మహీంద్రా కొత్త మోడల్

ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ విడుదల

రాజమహేంద్రవరం రూరల్: మహీంద్రా కొత్త మోడల్ 'ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ'ను తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా అధీకృత డీలర్ ఎంఅండ్ఎస్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ మార్కెట్లోకి విడుదల చేసింది. దీనిని శనివారం స్థానిక ఎంఅండ్ఎస్ మోటార్స్‌లో కస్టమర్ల చేతుల మీదుగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ ధర రూ. 7.49 లక్షల నుంచి ప్రారంభమవుతుందన్నారు. కాంపాక్ట్ ఎస్'యూవీ సెగ్మెంట్'లో కొత్త బెంచ్ మార్క్‌లను సెట్ చేసిన 'ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ' అద్భుతమైన డిజైన్, ప్రీమియం ఇంటీరియర్స్, సౌకర్యవంతమైన రైడ్, అత్యాధునిక టెక్నాలజీ, థ్రిల్లింగ్ పెర్ఫార్మెన్స్, సాటిలేని భద్రతతో రూపొందించిందన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీరామ్ మాట్లాడుతూ, 'ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ' అత్యున్నత స్థాయి భద్రత, అత్యాధునిక సాంకేతికత మరియు అద్భుతమైన డిజైన్‌తో థ్రిల్లింగ్ పనితీరును కనబరుస్తుందన్నారు. మన్నికైన, బాగా పరీక్షించిన ప్లాట్‌ఫామ్‌పై నిర్మించిన ఇది బి-ఎన్‌సిఎపితో సహా అత్యున్నత ప్రపంచ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించారన్నారు. ఎక్స్‌యూవీ 3 ఎక్స్‌ఓ బుకింగ్స్ ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో, ఏకకాలంలో ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో కస్టమర్లు, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.



మహీంద్రా కొత్త మోడల్ ఎక్స్‌యూవీ 3 ఎక్స్‌ఓను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న కస్టమర్లు

ఎన్నిక.. భవితకు సూచిక

- ఈవీఎంలకు 41 ఏళ్లు
- పారదర్శక ఓటింగ్‌కు భరోసా

రాయవరం: ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకం.. అలాంటి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పలు సంస్కరణలు ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా బ్యాలెట్ బాక్స్ మొదలు ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్) వరకూ ఓటింగ్ విధానంలో పలు మార్పులు తీసుకు వచ్చింది. ఈవీఎం, వీవీ ప్యాట్, నోటా వంటి నూతన విధానాలు పారదర్శక ఓటింగ్‌కు భరోసాగా నిలుస్తున్నాయి. 1999 ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల ముద్రణకు 7,700 టన్నుల పేపరును వాడినట్లు సమాచారం. 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్‌కు ఈవీఎం వాడడంతో 10 వేల టన్నుల కాగితాన్ని సేవ్ చేయగలిగారు. ఈవీఎంలపై నెలకొన్న సందేహాలకు నివృత్తిగా పలు సమాధానాలను ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం విశేషాలపై ప్రత్యేక కథనం ఇది.

ఎప్పటి నుంచి ఎలా..

ఈవీఎంలు వినియోగంలోకి వచ్చి 41 ఏళ్లు అవుతుంది. 1982లో బ్యాలెట్ పత్రాలకు ప్రత్యామ్నాయంగా ఈవీఎంలు తీసుకు వచ్చారు. 1982 మే 19న కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పరోగ్ నియోజకవర్గంలో తొలిసారి ఈవీఎంలను వినియోగించారు. అనంతరం దేశవ్యాప్తంగా 1982–83 సంవత్సరంలో పది నియోజకవర్గాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో వాడారు. 1998లో ఈవీఎంల వాడకానికి ప్రజామోదం లభించింది. వివిధ రాష్ట్రాల్లో 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించారు. వీవీ ప్యాట్లను వాడాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. దశల వారీగా 2013 నుంచి వీవీ ప్యాట్లను వినియోగిస్తున్నారు.

ఓటు వేస్తారిలా..

ఈవీఎం ఓటింగ్ విధానంలో కంట్రోల్ యూనిట్ ప్రిసైడింగ్ అధికారి వద్ద, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఉంటుంది. బ్యాలెట్ యూనిట్‌పై ఓటరు తనకు నచ్చిన అభ్యర్థి గుర్తుకు ఎదురుగా ఉన్న బ్లూ బటన్ నొక్కగానే ఎరుపు రంగు లైట్ మెరుస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి సీరియల్ నంబరు, పేరు, గుర్తు చూపించే పేపరు స్లిప్ వీవీ ప్యాట్ విండో ద్వారా సుమారు ఏడు సెకన్ల పాటు కనిపించి, డ్రాప్‌బాక్స్‌లో పడగానే కొద్దిసేపు బీప్ అనే శబ్దం వస్తుంది. దీంతో ఓటు నమోదైందని తెలుసుకోవచ్చు.



బ్యాలెట్ యూనిట్

ఈవీఎం అంటే..

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ను ఈవీఎం అంటారు. ఇది ఎన్నికల్లో పోలైన ఓట్లను ఎలక్ట్రానిక్ విధానంలో రికార్డు చేయడంతో పాటుగా పోలైన ఓట్లను లెక్కించే పరికరం. ఈవీఎంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు జతగా వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) ఉంటోంది. ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లో నోటాతో పాటు 15 మంది అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయి. ఒకవేళ అంతకంటే ఎక్కువ అభ్యర్థులు బరిలో ఉంటే మరో బ్యాలెట్ యూనిట్‌ను అనుసంధానం చేస్తారు. ఇలా ఒక ఈవీఎంకు 24 బ్యాలెట్ యూనిట్లు అనుసంధానం చేయవచ్చు. తద్వారా 384 మంది అభ్యర్థుల వరకు సేవలు అందిస్తుంది. ఇక ఓట్ల విషయానికి వస్తే గరిష్ఠంగా రెండు వేల ఓట్లను రికార్డు చేస్తుంది. కానీ ఎన్నికల్లో సాధారణంగా 1,500 ఓటర్లను నమోదు చేయడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు.



కంట్రోల్ యూనిట్

మెషీన్ మొరాయిస్తే..

పోలింగ్ సమయంలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ క్రమం తప్పితే బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు వీవీ ప్యాట్‌తో కూడిన కొత్త సెట్ ఏర్పాటు చేస్తారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో రిజర్వ్ దశ నుంచి పనిచేయని దశ వరకూ నమోదైన ఓట్లు, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ బ్యాలెట్ స్లిప్పులు కంపార్ట్‌మెంట్ మెమెరీలో భద్రంగా ఉంటాయి. వీవీ ప్యాట్ మాత్రమే పనిచేయకుంటే కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లు దాని మెమెరీలో భద్రంగా ఉంటాయి. దీంతో పనిచేయని వీవీ ప్యాట్ స్థానంలో రిజర్వ్‌లో ఉంచిన వీవీ ప్యాట్‌ను ఏర్పాటు చేసి పోలింగ్ తిరిగి ప్రారంభిస్తారు. ఏదైనా సాంకేతిక కారణాలతో కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లను నిర్ధారించకుంటే కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట స్లిప్పులను లెక్కిస్తారు.

విద్యుత్ అవసరం లేదు

ఈవీఎంలకు విద్యుత్ సరఫరా అవసరం లేదు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లకు సొంతంగా బ్యాటరీ/పవర్–ప్యాక్ సౌకర్యం ఉండడంతో విద్యుత్ సరఫరా లేని ప్రాంతాల్లో సైతం వీటిని ఉపయోగించవచ్చు. బ్యాలెట్ బాక్సులతో పోలిస్తే ఈవీఎంల రవాణా చాలా సులభం.



వీవీ ప్యాట్

ఓట్ల సంఖ్య తెలుసుకోవచ్చు

ఈవీఎం కంట్రోల్ యూనిట్‌లో ఫలితం బటన్‌తో పాటు, టోటల్ బటన్ ఉంటుంది. పోల్ సమయంలో ఎప్పుడైనా ఈ బటన్ నొక్కితే అప్పటి వరకూ పోలైన మొత్తం ఓట్ల సంఖ్య తెలుస్తుంది. పోలింగ్ ముగియగానే క్లోజ్ బటన్ నొక్కితే మెషీన్ ఇకపై ఓట్లను అంగీకరించదు.

ఈవీఎంల భద్రత ఇలా..

పోలింగ్ తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో సెక్యూరిటీ బలగాల పహారాలో భద్రపరుస్తారు. ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేసి ఎన్నికల అధికారులతో పాటు అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సంతకాలతో సీలు వేస్తారు. కౌంటింగ్ రోజున అభ్యర్థులు/వారి ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారి, ఎన్నికల సంఘం పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌లు తెరుస్తారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. లెక్కింపు పూర్తయిన తర్వాత, వీవీ ప్యాట్ స్లిప్పులను బయటకు తీసి, అభ్యర్థులు/వారి ప్రతినిధుల సమక్షంలో నల్లటి కవరులో భద్రపరుస్తారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



సాధించిన రికార్డులతో రియాన్స్

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో యూకేజీ చదువుతున్న బి.రియాన్స్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించాడు. ఐదేళ్ల రియాన్స్ ఆన్‌లైన్ ద్వారా జరిగిన ఎంపిక ప్రక్రియలో తొమ్మిది సెకండ్లలో దక్షిణ అమెరికా ఖండంలో 13 దేశాల జెండాలను గుర్తించి ఈ ఫీట్ సాధించాడని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ తెలిపారు. అలాగే ప్రపంచ పటంలోని దేశాలను గుర్తించడంతో పాటు ప్రపంచ దేశ రాజధానులు, భారతదేశ రాష్ట్రాల రాజధానులను గుర్తించడంలో కూడా ప్రతిభ కనబరిచాడని వివరించారు. చిన్న వయసులో ఇలాంటి ఘనత సాధించడం అభినందనీయమని విద్యాసంస్థల అధినేత నరశింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, ఉపాధ్యాయులు కొనియాడారు.

ఎవరా వృద్ధురాలు?

రామచంద్రపురం రూరల్: గుర్తు తెలియని ఓ వృద్ధురాలు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర శనివారం విలేకరులకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ద్రాక్షారామ భీమేశ్వరాలయం వద్ద ఓ వృద్ధురాలు కళ్లు తిరిగి పడిపోయింది. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమెకు సంబంధించిన వారు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో సంప్రదించాలని, అదే విధంగా వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని ఎస్సై కోరారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధురాలు

వైభవంగా వేంకటేశ్వరస్వామి వ్రతం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి సన్నిధిలో శనివారం చైత్ర బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రప్రథమంగా వేంకటేశ్వరస్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ ఈ కార్యక్రమం ఆద్యంతం కనుల పండువలా జరిగింది. ఆలయ ఈఓ గ్రంధి మాధవి పర్యవేక్షణలో నిర్వహించిన స్వామి వారి వ్రతాల్లో పలువురు భక్త దంపతులు పాల్గొన్నారు. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. స్వామి వారి దర్శనానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2,61,766 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2 లక్షల 345 ఆదాయం లభించిందన్నారు. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.61,421 విరాళంగా అందించారని తెలిపారు. 3,195 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, 2,408 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.